www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 19 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

## ఘనంగా హనుమంతు కృష్ణయ్య 21వ వర్ధంతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్లుగ్రామంలో సిపిఐ నాయకుడు హనుమంతు కృష్ణయ్య 21వ వర్ధంతిని బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

మిగతా 2లో..

# ఎంత ఘాటు ప్రేమయో..!




**-అనుమతులు లేకుండానే కోట్లలో వ్యాపారాలు**
**-మామూళ్ల మత్తులో కార్పోరేషన్ సిబ్బంది**
**-అనుమతులు లేవని ఆర్టిఐతో ధృవీకరణ**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో సిబ్బంది కొందరిపై ఘాటు ప్రేమను చూపిస్తున్నారు. సామాన్యులు అనుమతులు తీసుకోవడంలో ఆలస్యమైతే సదరు వ్యాపార సంస్థలను మూసివేయడం, పన్నులు చెల్లించడంలో జాప్యం జరిగితే అదనపు బాదుడు అందరికీ తెలిసిందే. కానీ కొందరి విషయంలో మాత్రం ఉన్నతాధికారుల నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు ఉదాసీన వైఖరిని అవలంభిస్తున్నారు. ఒక ఏడాది కాదు రెండేళ్లు కాదు ఆరేండ్లుగా అనుమతులు లేని వ్యాపారం నిర్వహించడంతో పాటు స్వయంగా వ్యాపారి కోట్ల రూపాయల టర్నోవర్ చేస్తున్నట్లు స్వయం ధృవీకరణ చేసిన అధికారులు పట్టించుకోవడం లేదంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఆలోచించుకోవచ్చు. అనుమతులు లేవని స్వయంగా కార్పోరేషన్ అధికారులే ధృవీకరించి కనీస చర్యలు తీసుకోవడం లేదంటే దీని వెనక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. ఇల్లందు రోడ్డులో ఎన్నెస్పి గెస్ట్‌హౌజ్ సమీపంలో శ్రీవిజయ దుర్గ స్టీల్ సిండికేట్ పేరుతో ఒక దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దుకాణం నిర్వహణకు సంబంధించి కార్పోరేషన్ వద్ద నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని గతేడాది అక్టోబర్ 21న కార్పోరేషన్ అధికారులు ధృవీకరించారు. అంతే కాదు శ్రీ విజయ దుర్గ స్టీల్ సిండికేట్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామని లిఖిత పూర్వకంగా

మిగతా 2లో..

## నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు..!




**-పట్టించుకోని రవాణా శాఖాధికారులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి జిల్లాలోని విద్యా సంస్థలకు చెందిన బస్సులు కనీస నిబంధనలను పాటించడం లేదు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం , నైపుణ్యలేని డ్రైవర్లను నియమించడంతో పాటు కనీస ప్రమాణాలను పాటించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పాఠశాలల మొదలు ఉన్నత విద్యా సంస్థల వరకు ఈ నిబంధనలు పట్టించుకోవడం లేదని బస్సు స్థాయికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఫిట్‌నెస్ విషయంలో అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని కొన్ని విద్యా సంస్థలకు చెందిన బస్సులు పోతుంటే వెనక నుంచి ఫ్యాక్టరీలో వచ్చే విధంగా పొగలు కమ్ముతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. అసలు ఎన్ని బస్సులకు అనుమతులు ఉన్నాయి, ఎన్ని బస్సులను వినియోగిస్తున్నారు. వినియోగంలో ఉన్న అన్ని బస్సులకు అనుమతులు ఉన్నాయా లేవా అన్న దానిపై కూడా రవాణా శాఖాధికారుల వద్ద సమాచారం లేదు. కార్పోరేట్, పెద్ద విద్యా సంస్థలకు చెందిన బస్సుల విషయంలో అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ఇక్కడ కూడా పెద్ద, చిన్న తేడాలను పాటిస్తున్నారని

మిగతా 2లో..

## ఈ విజయం చారిత్రాత్మకం





**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌కు ఘన సన్మానం**
**- ప్రజా ఆశయాల విజయమే ఈ ఫలితం**
**- కొరిమి రాజ్ కుమార్**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పోరేషన్‌కు తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సిపిఐ 23 డివిజన్లతో పాటు మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల ఏఐటియూసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అనందం వ్యకత చేసింది. ఈ సందర్భంగా మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌ను కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు పర్యవేక్షణ, సూచనలతో పార్టీ అభ్యర్థుల గెలుపుకు నిరంతరం కృషి చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాను ఘనంగా సన్మానించారు. సిపిఐ, ఏఐటియూసి జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరికీ షాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక, ప్రజా వర్గాల విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం అభివృద్ధికి మేయర్, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ విజయం ప్రజా పోరాటలకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌వి రమణమూర్తి, బాజీసైదా తదితరులు పాల్గొన్నారు.

# ఎంత ఘాటు ప్రేమయో..!

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటు వంటి చర్యలు తీసుకోలేదు. ఈ దుకాణం నిర్వహిస్తున్న ఇంటిని కార్పోరేషన్ గుర్తించి నెంబర్ కేటాయించ లేదు. వ్యాపారం నిర్వహించుకునేందుకు కార్పోరేషన్ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. అయినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరి స్తుంది. మున్సిపల్ సిబ్బంది సదరు వ్యాపారులతో ఉన్న లావాదేవీల కారణంగానే ఈ వ్యాపారిపై చర్యలు తీసు కోవడం లేదని తెలుస్తుంది.



**పట్టించుకోని ఉన్నతాధికారులు...**

క్షేత్రస్థాయి సిబ్బంది ఈ వ్యవహారాన్ని ఉన్నత అధికారుల దృష్టికి పోకుండా జాగ్రత్త పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఆరేండ్లుగా అనుమతులు లేని వ్యాపారం కోట్లలో నడు స్తున్నా చర్యలు తీసుకోకుండా కార్పోరేషన్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నది ఎవరన్న దానిపై కూడా ఉన్నతాధికా రులు దృష్టిసారించాల్సి ఉంది. స్వయంగా అనుమ తులు లేవంటూ తామే ధృవీకరించి నెలలు గడు స్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నకు జవాబు దొరకడం లేదు. వ్యాపార నిర్వహ ణకు కార్పోరేషన్‌కు చెల్లించాల్సిన వాణిజ్య పన్నును ఎందుకు వదిలి వేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొందరిని పన్నుల పేరుతో వేధించి మరికొందరిని ఎందుకు వదిలి వేస్తున్నారని వ్యాపారులు ప్రశ్నిస్తు న్నారు. ఇది ఒక్కటేనా ఇంకా కార్పోరేషన్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వ్యాపారాలు ఎన్ని ఉన్నాయి అన్న సందేహం కూడా కలుగు తుంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కార్పోరేషన్ సిబ్బంది లాగేసుకుంటున్నారన్న విమర్శలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికై సహకరించండి

**కల్లూరు మున్సిపల్ కార్మికులతో చైర్మన్ మోహన్ నాయక్**




ప్రజాపక్షం/కల్లూరు: అందరం కలిసి ఐకమత్యంతో కల్లూరు మున్సిపా లిటీని అభివృద్ధి చేసుకుందామని, దానికి కార్మికులు సహకరించాలని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి లను ఏఐటి యుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మా నించారు. అనంతరం ఏఐటియుసి జిల్లా నాయకులు దామల దయాకర్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో మోహన్ నాయక్ మాట్లాడుతూ వార్డు సభ్యునిగా, సర్పంచ్ గా పనిచేసిన తనకు పాలనపై అవగాహన ఉందన్నారు. ఇదే సందర్భంలో కార్మికుల ఇబ్బందులను, కష్టాలను దగ్గ రుండి చూసినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ కార్మికుల ఏడు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నట్లు తన దృష్టికి వచ్చింద మున్సిపాలిటీ తొలి సమావేశంలోనే ఈ విషయంపై చర్చించి సమస్యను పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు.

**కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : రామాంజనేయులు**

నూతనంగా ఏర్పాటు అయినా కల్లూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు చైర్మన్ వైస్ చైర్మన్ ల దృష్టికి తీసుకువెళ్లారు. ఏడు నెలల పెండింగ్ వేతనాలతో పాటు, బూట్లు, గ్లౌజులు, సబ్బులు కొబ్బరి నూనె , రైన్ కోట్లు, యూప్రాన్లు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల జీతం చెల్లించినప్ప టికిని పిఎఫ్ ఈఎస్ఐ విషయంలో అధికారులు ఇంతవరకు ఏ సమా చారం ఇవ్వలేదని. జీవో నెంబర్ 14 ప్రకారం జీతాలు చెల్లించినప్పుడు వారికి పీఎఫ్ ఈఎస్ఐ ని కూడా వెంటనే చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్ప టికైనా అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను తీర్చాలని వారు ఈ సందర్భంగా కోరారు. కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి తాము కూడా కట్టుబడి ఉన్నామని, మున్సిపాలిటీకి మంచి పేరు తెచ్చేందుకు కార్మికులందరూ కృషి చేస్తారని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. చైర్మన్ వైస్ చైర్మన్ ల తో పాటు కల్లూరు మున్సిపాలిటీ మేనే జర్ నంది శెట్టి నాగేశ్వరరావును కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఓడల కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి సయ్యద్ వజీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాసా శ్రీకాంత్, శీలం కృష్ణారెడ్డి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాగంటి రాజశేఖర్, మెప్మా నాయకురాలు జొన్నలగడ్డ కుమారి, స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రేణుక , మలేఖ ,మిడ్డె మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వంశీ, కృష్ణ , మున్సిపల్ నాయకులు కంభంపాటి సుధాకర్, చింతపల్లి శ్రీను, కంభంపాటి ప్రకాష్, లక్కినేని ప్రవీణ్, గొల్లమండల యశోద, అంజలి, మణిరాజ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన జిల్లా అధికారి



ప్రజాపక్షం/కల్లూరు: ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మండల పరిధిలోని కప్పల బంధం చెన్నూరు గ్రామాలలో ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫెర్టిలైజర్ యాప్ ద్వారానే అమ్మకాలు జరగాలని పి ఓ ఎస్ మిషన్ ద్వారా నిల్వలు ఉన్నాయా లేదో తెలుసుకో వాలని అదేవిధంగా చెన్నూరులో రైతు గుర్తింపు కార్డు అంతర్జాల ప్రక్రియ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల దుకాణదారులకు పలు సలహాలు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిని రూప, వ్యవసాయ విస్తరణ అధికారులు పవన్ కళ్యాణ్, వెంకట లీల, సొసైటీ కార్యదర్శులు రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా రాయితీపై వ్యవసాయ పనిముట్లు తో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాయితీపై ఆరు రోటవేటర్లు 11 ట్రాక్టర్ పని ముట్లు మండలం కు రావడం జరిగిందని ఆసక్తిగల రైతులు 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కల్లూరు రైతు వేదిక నందు దరఖాస్తు ఫారాలు అందజేయాలని వ్యవసాయ శాఖ శాఖ అధికారిని రూపా తెలి పారు.

# వైరా మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ చైర్మ న్‌గా నియమితులైన డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ దంపతులను తెలుగుదేశం పార్టీ వైరా నియోజకవర్గ కన్వీనర్ చెరుకూరి చల పతి, మండల అధ్యక్షుడు కిలారు సురేంద్ర, పట్టణ అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాస్, మండ దపు మధుసూదన్‌రావు, మోత్కూరు వెంకటే శ్వరరావు, మద్దినేని రామారావు,బోడేపూడి మురళి తదితరులు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సన్మానించారు. మున్సిపాలిటీ ఎన్ని కల్లో 6వ వార్డు ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి గెలిపించారని, తద్వారా చైర్మన్‌గా నియ మితులు కాబడ్డారని వారు పేర్కొన్నారు. చైర్మన్‌గా నియమించి గౌరవ శాసనస భ్యులు మాలోతు రాందాస్‌నాయక్ మంచి నిర్ణయం తీసుకున్నారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమంతు కృష్ణయ్య 21వ వర్ధంతి

(మొదటిపేజీ తరువాయి)

పువ్వకాయల కమలాకర్ హాజరై స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నిజాయితీకి నిలువుటద్దం హన్మంతు కృష్ణయ్య అని కొనియా డారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని, ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమంతు రాము, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

కొందరు విద్యా సంస్థల యజమానులు ఆరోపిస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థకు చెందిన బస్సుల గురించి రవాణా శాఖాధికారులు అసలు పట్టించుకోవడం లేదని బస్సు స్థాయికి మించి రెట్టింపు విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తున్నా ఆ బస్సుల వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసే కంటే ముందే తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని విద్యార్థుల తల్లిదండ్రులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖాధికారులు బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్రైస్తవుల ఉపవాస ప్రార్థనలు ప్రారంభం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం పరిధిలోని కల్లూరు పెద్ద కోరుకొండి విచారణ పరిధిలో క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మత గురువులు వినయ్ కుమార్ రెడ్డి అంతోనిలు బోధిస్తూ ప్రతి క్రైస్తవునికి శపత్కాలం ఒక కృపాకాలం పాపకు అలవాట్లలో స్వార్థపు జీవనంలో తిరుగుతున్న మనం 40 రోజులలో ప్రార్థన ఉపవాసం దానధర్మాల ద్వారా మన హృదయాన్ని శుద్ధి చేసుకోవాలని గొంగళి పురుగు ఎలా తన పాత రూ పాన్ని వదిలి సీతాకోకచిలుకగా మారుతుందో అలాగే మనం కూడా పాప స్వభావాన్ని విడిచిపెట్టి క్రీస్తు స్వరూపంలో మనుషులుగా మారాలని క్రైస్తవులను కోరారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు వినయ్ కుమార్ రెడ్డి, అంతోని సురేష్, కల్లూరు విచారణ పరిధిలోని కప్పల బంధం , పాయపూర్, పేరువంచ, లింగాల, పెద్ద కోరు కొండి విచారణ పరిధిలో చిన్న కోరుకొండి, ఎర్రబోయినపల్లి ,చెన్నూరు, తాళ్లూరు వెంకటాపురం తదితర గ్రామాల క్రైస్తవులు యువతీ యువకులు, కన్య స్త్రీలు, ఉపదేశకులు, సంఘస్తులు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటిన చైర్‌పర్సన్ రిహానా



ప్రజాపక్షం/సత్తుపల్లి: మానవీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్మన్ రిహానాకమల్ పాషా దంపతులు. గుండె సంబంధిత అనారో గ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు డివన్ చారీకు ఆర్థిక సహాయం చైర్మన్ రిహానాకమల్ పాషా దంపతులు 10 వేల ఆర్థిక సాయం అందించారు.ఈ సహా యాన్ని సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా నగదు రూపంలో బుధవారం అందజేశారు. చికిత్స నిమిత్తం ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుం దని కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ"పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకులకు అవసరమైన వేళ అండగా నిలవడం మా బాధ్యతని, డివన్ చారీ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు.చైర్మన్ రిహన కమల్ పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ కుటుంబం ఎప్పుడూ తన కార్యకర్తలను, నాయకు లను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటుందన్నారు.ఈ సహాయం సత్తుపల్లి ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై మరింత విశ్వాసాన్ని పెంచిందని స్థానికులు వ్యాఖ్యానించారు.ఇలాంటి మానవీయ కార్యక్రమాలు సమాజంలో పరస్పర సహకారం, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి



ప్రజాపక్షం/కొత్తగూడెం : ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కార్పోరేటర్ కచర్ల హిమశ్రీ అన్నారు. బుధవారం 18వ డివి జన్ పరిధిలోని ఉన్న మాతశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించి ఆస్పత్రిలోని వార్డులను కలియ తిరిగారు. అనంతరం హిమ శ్రీ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యాన్ని అందించి ప్రభుత్వ వైద్యంపై మరింత నమ్మకం కలిగేలా చేయాలని సూచించారు. ఎక్స్‌రే, స్కానింగ్ వంటి వాటికోసం బయటకు పంపకుండా ఆస్పత్రిలోనే చేయాలని చెప్పారు. అనంతరం వంటషెడ్‌ను పరిశీలించి ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు రుచికరమైన వంటకాలు తయారు చేసి పెట్టా లన్నారు. ఆస్పత్రి పరిసరాలతో పాటు అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా జరిగే ప్రతీ ఉచిత వైద్యాన్ని రోగులకు సరైన పద్ధతిలో అందించాలని, రోగు లతో మర్యాదగా మసులుకోవాలని చెప్పారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని, ఆ వృత్తికి ఎలాంటి కలంకం రాకుండా తమవంతు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య, మాజీ కౌన్సిలర్ పాటి మోహన్ రావు, మండల రాజేశ్వరి, హరినాద్, ఎండి ముస్తఫా, సుదర్శన్, చప్పిడి కోటేశ్వరరావు, బడుగు భాస్కర్, కృష్ణ, మన్నెంపల్లి నిఖిల్, రాయుడు, మాధవ్, గద్దం ప్రసాద్, నరేందర్, శేఖర్, మధు సూదన్ రెడ్డి, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహమివ్వాలి

## సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం



ప్రజాపక్షం/చింతకాని : గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తున్న నేతాజీ యువజన సంఘం కృషి అభినందనీయమని కొనియాడారు. మహాశివరాత్రి జాతర పురస్కరించుకుని మండల పరిధిలోని నేరడ గ్రామంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండురాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీల విజేతలకు వైరా ఏసీపీ సారంగపాణి తో కలిసి మంగళవారం రాత్రి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 44 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినంధనీయమని, ప్రతి ఒక్కరూ గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహమివ్వాలన్నారు. అనంతరం మొదటి బహుమతి రూ.50వేలు ఖమ్మం జట్టు, రెండవ బహుమతి కల్లూరు, మూడవ బహుమతి కాకినాడ, నాల్గవ బహుమతి కొత్తగూడెం, ఐదవ బహుమతి చెరువుమాదారం, ఆరవ బహుమతి నేరడ, ఏడవ బహుమతి బయ్యారం, ఎనిమిదవ బహుమతి బర్ఖత్‌గూడెం, తొమ్మిదవ బహుమతి విజయవాడ జట్లు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, నేతాజీ యూత్ అధ్యక్షులు , నేరడ సర్పంచ్ దూసరి నేతాజీ, సిపిఐ జిల్లా నాయకులు దూసరి శ్రీరాములు, నంబూరి శంకర్‌రావు ,ఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్, చింతకాని మండల పార్టీ కార్యదర్శి దూసరి గోపాలరావు, ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు, మాజీ ఖమ్మం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్, చింతకాని ఎస్సై వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కంచర్ల పిచ్చమ్మ మరణం సిపిఐకి తీరని లోటు

## సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు

ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని గోపవరం గ్రామ సిపిఐ సీనియర్ నాయకురాలు వ్యవసాయకార్మికసంఘం సబ్యురాలు కంచర్ల పిచ్చమ్మ(65) బుధవారం తెల్లవారుఝామున గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహంపై సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు మాజీ జెడ్పీటిసి యర్రా బాబు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పిచ్చమ్మ లేని లోటు సిపిఐ పార్టీకి తీరనిలోటని అన్నారు. ఆమె అందరితో కలివిడిగా ఆప్యాయంగా ఉండేదని కొనియాడారు. ఆమె మరణం బాధాకరమని అన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, జిల్లా సమితి సబ్యులు పాపగంటి సుదర్శన్, మాజీ ఎంపిటిసి పిడియాల వజ్రమ్మ, పిట్టల రాంబాబు, పిడియాల వెంకటి, నర్సింహులు, మురికిపూడి అశ్వీరాదం, జాంబవంతు, యశోద, వివిధపార్టీల నాయకులు మంగా చెన్నారావు, గుర్రం వెంకటేశ్వర్లు, దర్చి చెన్నారావు, బొమ్మ



కంటి వెంకటేశ్వర్లు, మద్దినేని వెంకటేశ్వర్లు, బండారు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# యువజనోత్సవాల్లో సత్తా చాటిన బోనకల్ విద్యార్థులు

ప్రజాపక్షం/బోనకల్ : జాతీయ సేవా పథకం యువజన ఉత్సవాల్లో బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కాకతీయ విశ్వవిద్యాలయం కో ఆర్డినేటర్ ఈసం నారాయణరావు పర్యవేక్షణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి జాతీయ సేవా పథకం యువజన ఉత్సవాలు 17వతేదీన ఖమ్మంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు పాల్గొని వ్యాసరచన పోటీలో జిల్లాస్థాయిలో జి.దేవీ ద్వితీయ బహుమతిని సాధించింది. క్విజ్ పోటీలో సిహెచ్. సాయికుమార్, బి.హేమంత్ కుమార్, ఎన్.వీణ ద్వితీయబహుమతిని సాధించారు. ఇటీవల జేఇఇ మెయిన్స్ ఫలితాల్లో కళాశాల విద్యార్థి వేమా అరవిందకుమార్ 69.24 పర్సంటేజ్ సాధించాడు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని ఆధ్వర్యంలో పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులు చదువుతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌గా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో



పాల్గొంటూ వ్యక్తిత్వ వికాసాన్ని, నాయకత్వ లక్షణాలను అవలంభించుకుంటూ క్రమశిక్షణతో చక్కని విద్యార్థులుగా తీర్చిదిద్దటం జాతీయ సేవా పథకం ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు, జిడ్డు జోనాధన్‌బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డ్‌ను తొలగించాలి

## - కమిషనర్ మున్వర్ అలీకి కౌన్సిలర్ శ్రీనాథ్‌రెడ్డి వినతి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : 32వ డివిజన్లోని స్మశానవాటికలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌ను తొలగించాలని సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పెద్దతండాలోని 26వ డివిజన్‌లో గల ఏదులాపురంమున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ మున్వర్ అలీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గుట్టలు..గుట్టలుగా పారబోస్తున్న చెత్త, వ్యర్థాలతో చెరువు కలుషితమవుతన్నట్లు పేర్కొన్నారు. దీంతో 31,32 డివిజన్లతో పాటు మంచినీటి రక్షిత పథకం ద్వారా నీరందుతున్న ప్రాంతాలు కలుషిత నీటిని తాగాల్సి వస్తుందన్నారు. అలాగే చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లడంతో పాటు కాల్చడం వలన పొగ గాలిలోకి వెళ్లి వాయు కాలుష్యము జరుగుతుందన్నారు. అలాగే స్మశానవాటిక చుట్టూ పెరిగిన ముళ్లచెట్లు, కలుపు మొక్కలు తొలగించి పరిశుభ్రమైన వాతావరణం



కల్పించాల్సిందిగా కోరారు. స్మశానవాటికలో నీటి సరఫరా, మరుగుదొడ్లకు మరమ్మత్తులు నిర్వహించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ పరిష్కారం చేపిస్తానని, హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



ప్రజాపక్షం/ బోనకల్ : మండల కేంద్రం బోనకల్‌లోని కేజిబివి పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను బుధవారం పంపిణీ చేయటం జరిగింది. గత నెల 28న తేదీన పాఠశాలను సందర్శించిన మండల స్పెషలాఫీసర్ విజయభాస్కర్‌రెడ్డికి విద్యార్థులు తమ అవసరాలను, సమస్యలను తెలిపారు. ముఖ్యంగా భోజనానికి ప్లేట్లు, తాగునీటి కోసం గ్లాసులు లేవని వారు తెలిపారు. వీలైనంత మేరకుసహాయం అందిస్తామని స్పెషలాఫీసర్ హామీ ఇవ్వడం జరిగింది. ఆ హామీ మేరకు పాఠశాలలో చదువుకుంటున్న సుమారు 40మంది విద్యార్థులకు విజయభాస్కర్‌రెడ్డి దాతృత్వంతో వీటిని అందించటం జరిగింది.అదేవిధంగా పాఠశాల సమీపంలోని అనాధ శరణాలయంలో నివసిస్తున్న 10మంది దివ్యాంగులకు కూడా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంఇఓ డి.పుల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీనియర్ సిపిఐ నాయకురాలు నర్సమ్మ మృతి



ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన సీనియర్ సిపిఐ నాయకురాలు నర్సమ్మ(83) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మరీదు నర్సమ్మ అకాల మృతి సిపిఐకి తీరని లోటన్నారు. మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ గ్రామ కార్యదర్శి వంగాల కృష్ణ, నాయకులు మరీదు మల్లయ్య, వంగాల నారాయణ, బ్రహ్మం, నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు చిట్టిమోతు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# మత్కేపల్లి మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రారంభం



ప్రజాపక్షం/చింతకాని : జగన్నాధపురం రైతువేదిక నందు మత్కేపల్లి మార్కెట్ కమిటీ నూతన కార్యాలయాన్ని బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ నూతన మార్కెట్ ను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి నామాల శ్రీనివాసరావు, డైరక్టర్ బందెల నాగార్జున , జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ , కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియదర్శిని విద్యార్థినుల ప్రతిభ




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6వ డివిజన్‌లో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదల చేసిన జేఎన్టీయూహెచ్ ఫైనల్‌ఇయర్ ఫలితాలలో ప్రతిభను కనబరిచారు. సిఎస్సి విభాగానికి చెందిన సిహెచ్ సౌమ్య, సిహెచ్ శృతి, పి. ప్రియాంక, ఎస్ శ్రీకీర్తి, వై. రిషితయాదవ్ 8.8జీపీఏ సాధించారు. ఏఐడీ విభాగంలో ఆర్ రితిక 9.1, ఏం సౌగంధిక, ఎం గిర్వాణి, పి. లక్ష్మి శరణ్య 8.8, డి. మంజూష 8.7 జీపీఏ సాధించారు. ఈసీఈ విభాగంలో ఎస్ శైలజ, 8.9 జీపీఏ, ఎస్ మంజుశ్రీ 8.7 జీపీఏ సాధించారు. వీరిని బుధవారం కళాశాలలో చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపల్ గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ వెంకటరమణ, ఫ్యాకల్టీ అభినందించారు.

# ఎంపి ల్యాండ్స్ నిధులు రూ.40లక్షలు మంజూరు

ప్రజాపక్షం/ మధిర : కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకచౌదరి నిధుల నుండి మధిర ఎర్రుపాలెం మండలానికి రూ.40లక్షలు ఎంపి ల్యాండ్స్ నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జవ్వాజి ఆనందరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణుకచౌదరి కేంద్ర మంత్రిగా ఉన్న సందర్భంలో ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని, గిరిజన బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, మధిర ప్రాంత అభివృద్ధికి ఎన్నో నిధులు వారు సొంతంగా కేటాయించారని పేర్కొన్నారు. మధిర, ఎర్రుపాలెం మండలాలోని నూతన సిసి రోడ్ల నిర్మాణం, సైడ్‌డ్రైన్స్, గ్రావెల్, వీధి లైట్ల ఏర్పాటుకు ఎంపి ల్యాండ్స్ నుండి రూ.40లక్షలు నిధులు మంజూరు చేయటం జరిగిందని వివరించారు. మధిర ప్రాంతంపై ఉన్న ప్రేమతో ఎంపి ల్యాండ్స్ నిధుల నుండి మంజూరు చేసినందుకు రేణుకచౌదరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఇద్దరు హెచ్‌ఎంలపై వేటు

ప్రజాపక్షం/ మధిర టౌన్ : మధిరలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు హెచ్‌ఎంలపై జిల్లా విద్యాశాఖ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం హైమావతిని వరంగల్ ఆర్జేడికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కలెక్టర్ తనిఖీలో లోపాలు గుర్తించినట్లు సమాచారం. ఎంపిపిఎస్ గర్ల్స్ స్కూల్ హెచ్‌ఎం కెబిఎన్ రాజును వేంసూర్‌కు బదిలీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వల్లే ఈ చర్యలని డిఇఓ జైని తెలిపారు.

## గరికపాడులో సైన్స్ ఎక్స్‌పో



ప్రజాపక్షం/వైరా: ఈ నెల20వ తారీఖు శుక్రవారం రోజున గరికపాడు ఉన్నత పాఠశాలలో గీతం యూనివర్శిటీ హైదరాబాద్(పూర్వ గరికపాడు విద్యార్థి) ప్రస్తుతం గీతం,యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.రాంబాబు, గ్రామ సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి, ఇతర పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పో ఉదయం 9గంటల నుండి నిర్వహించడం జరుగుతుంది. ఈ సైన్స్ ఎక్స్‌పోకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి బహుమతులు కలవు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు, కన్సోలేషన్ బహుమతులు రూ.1000లు, మరియు సైన్స్ క్విజ్ పోటీలు కూడా కలవు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు, మరియు కన్సొలేషన్ రూ.1000లు చొప్పున 5 బహుమతులు కలవు. ఈ సదవకాశం వినియోగించుకొని ఎక్కువ మంది భాగస్తులవుతారని అన్నారు. ఈ క్రింది నెంబర్‌లను సంప్రదించాలని హెచ్‌ఎం డి.సత్యనారాయణ 9441075932, ఏ.రమేష్ 9985912840, జె.యాకూబ్ 9989145008, బివి.బ్రహ్మం 9989537512 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ను సన్మానించిన మిత్రులు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ను 2000 సంవత్సరం మధు విద్యాలయం పదో తరగతి స్నేహితులు ఘనంగా సన్మానించారు. తమ తోటి మిత్రుడు చిన్న వయసులోనే మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా నియమితులు కావడం చాలా సంతోషకరమని, వైరా మున్సిపాలిటీలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తీర్చడంలో ముందుండాలని వారు ఆకాంక్షించారు. మున్ముందు మరెన్నో ఉన్నత పదవులు అధిరోధించాలని వారు పేర్కొన్నారు. సన్మానించిన వారిలో స్నేహితులు మూల దుర్గాప్రసాద్, మిట్టపల్లి విజయ్, ఆరుట్ల సనత్‌కుమార్, తల్లపురెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అనుబోతు రామకృష్ణ, దుద్దుకూరి బాబురావు, ముదిగొండ కృష్ణ, నిమ్మల శ్రీకాంత్, ఎర్నాకుల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యాన్ని చాటిన వేల్పుల దంపతులు



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన వేల్పుల మురళి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వేల్పుల మురళి తన సొంత గ్రామంలో తన సొంత డబ్బులతో మసీదుకు మైక్ వితరణగా అందజేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ చేతుల మీదుగా వేల్పుల మురళి వల్లాపురం మసీద్‌కు మైకు సెట్‌ను బహూకరణగా అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు ఇప్పటికే నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల మురళి మతసామరస్యానికి ప్రతీకగా ముస్లీం సోదరులకు మసీదుకు మైకు అందించడం నిజంగా అభినందించదగ్గ విషయమని ఆయన వేల్పుల మురళిని ప్రత్యేకంగా అభినందించారు. మతసామరస్యానికి మనం అందరం ప్రత్యేకంగా నిలవాలని హిందూ ముస్లీంలు బాయిబాయిగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా మున్సిపాల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాపక్షం/కూసుమంచి: శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు పాలేరు నియోజకవర్గ స్థాయిలో 21 ఫిబ్రవరి 2026 శనివారం నాడు సేవాలాల్ భవన్ స్థలం ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీసు ఎదురుగా కూసుమంచిలో నిర్వహించడం కోసం బుధవారం మంత్రి కార్యాలయ ఇన్చార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి పోస్టులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించుకోవాలని, ప్రతి తండా నుండి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, సేవాలాల్ అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు అవుతున్నారని తెలిపారు. కావున గిరిజన సోదరులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో గిరిజన నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బానోతు శ్రీనివాస్, బోడ మంగిలాల్, భూక్య చందు నాయక్, జరుపుల భద్రునాయక్, ధరావత్ నరేష్ నాయక్, రంజిత్ నాయక్, కొర్ర రమేష్ నాయక్, బొంగా నాయక్, బోడ వీరు నాయక్, పాప నాయక్, శివాజీ నాయక్, గిరిజన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# అలుగు నిర్మాణంలో నాణ్యతపై రైతుల నిలదీత

**నాసిరకం ఇసుక వాడకంపై రైతులు ఆగ్రహం**
**-పనులు జరుగుతున్నా కనిపించని ఇరిగేషన్ అధికారులు**



ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని సీతాయిగూడెంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్ట్ అయిన వెంగళరావు ప్రాజెక్ట్ అలుగు నిర్మాణం పనుల్లో నాసిరకం మెటీరియల్ వాడుతుండటంపై ఆయకట్టు(సీతాయిగూడెం, దామరచర్ల గ్రామాల)రైతులు బుధవారం ప్రాజెక్ట్ పనుల వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయకట్టు రైతులు నాసిరకం ఇసుకను చూసున్నప్పుడు అక్కడికి వచ్చిన కాంట్రాక్టర్ గుమ్మస్తాపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సైతం ట్రాక్టర్లతో లోకల్ (నాసిరకం)ఇసుకను తొలి, రాత్రి, పగలు తేడా లేకుండా కాంక్రీట్ పనులకు వాడుతున్నారని మండిపడ్డారు. దీంతో అక్కడ నుండి ఆ వ్యక్తి పక్కకు వెళ్లిపోయాడు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం అక్కడ లేకపోవడం గమనించదగ్గ విషయం. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాజెక్ట్ అలుగు నిర్మాణం కోసం రూ 33 కోట్లు మంజూరి చేస్తే, ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్ కలిసి నాసిరకంగా అలుగును నిర్మిస్తున్నారని ఆరోపించారు. పనులు జరిగే దగ్గర కనీసం ఇంజనీరు ఉండకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కోట్ల రూపాయల పనులు జరుగుతున్న చోట, ఇరిగేషన్ శాఖ అధికారులు ఉండకపోవడం వల్ల, లోకల్ ఇసుకను, అది కూడ మట్టితో కూడిన దాన్ని పనులకు వాడుతున్నారన్నారు. కాంక్రీట్ పనులకు గోదావరి ఇసుకకు బదులుగా లోకల్ ఇసుకను వాడుతున్నారని, 2500 ఎకరాల ఆయకట్టు, పది గ్రామాల రైతులు సాగు భూములు కలిగిన ప్రాజెక్ట్ భవిష్యత్‌ను అవినీతి వల్ల ప్రశ్నార్థకంగా చేస్తున్నారని విమర్శించారు. పనులు జరిగే చోట నిబంధనలు ఎక్కడా పట్టించుకోవడం లేదని, ఇదంతా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి, కాంట్రాక్టర్ మెప్పుకోసమే జరుగుతుందని విమర్శించారు. పనులను ఇలా చేపడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఆయకట్టు గ్రామాల రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయకట్టు రైతులు(దామరచర్ల, సీతాయిగూడెం గ్రామాల రైతులు)సీతాయిగూడెం సర్పంచ్ పిట్టల రామలక్ష్మయ్య, రైతులు బొర్రా కేశవులు, మాయర సతీష్, సంగొండి రాఘవులు, ఆంజనేయులు, చిన్నం గంగరాజు, మల్లయ్య, వాసం నాగేశ్వరరావు, పిట్టల నాగభూషణం, వేముల చిన్న వెంకటేశ్వరరావు, కనకం శ్రీను, బన్నె రాము, బొమ్మకంటి లక్ష్మణ్, జడ శ్రీను, బీరకాయల వెంకటేశ్వర్లు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలో జనరల్ ఫండ్ జమ ఎంత?

**-పూర్తిస్థాయిలో జనరల్ ఫండ్ జమ చేశారా?**
**-చేతివాటం ప్రదర్శించారా?**



ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలో పలు గ్రామపంచాయతీల్లో జనరల్ ఫండ్ పక్కదారి పట్టిందా లేదా వసూలు చేసిన జనరల్ ఫండ్ పంచాయతీ అకౌంట్‌లో పూర్తిస్థాయిలో జమ అయిందా అనే వాదనలపై పలు రకాల అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక అధికారుల పాలన తర్వాత పంచాయతీ ఎన్నికలకు జరిగి సర్పంచ్‌లు పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటివరకు పంచాయతీలో వసూలు చేసిన జనరల్ ఫండ్ కొన్ని పంచాయతీల్లో పూర్తిస్థాయిలో జమ కాలేదని వాదన సైతం జోరుగా వినిపిస్తున్నాయి. అసలు పంచాయతీలో వసూలైన జనరల్ ఫండ్ ఎంత, జమ చేసిన ఫండ్ ఎంత, ఇప్పటికే పలువురు సెక్రటరీ జనరల్ ఫండ్ జమ చేయడంలో నిర్లక్ష్యం వహించారనే మధ్యలో కొంత పంచాయతీలో జమ చేశారనే వాదనలు లేకపోలేదు. గతంలో గొల్లపూడి గ్రామపంచాయతీలో జనరల్ ఫండ్ సొంతానికి వాడుకున్న విషయంలో ఆ గ్రామపంచాయతీ సెక్రటరీని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒక్కొక్క పంచాయతీకి వసూలైన జనరల్ ఫండ్ పూర్తిస్థాయిలో ఎందుకు జమ చేయడం లేదు. ఎప్పటికప్పుడు వసూలైన పన్నును జమ చేయకుండా నెలల తరబడి వారి వద్ద ఉంచుకొని తర్వాత జమ చేయడం వెనక ఆంతర్యం ఏమిటి, ఫండ్ పూర్తిస్థాయిలో జమ చేస్తున్నారా అనే విషయాన్ని తెలుసుకోవాల్సిన అధికారి ఎవరు? ఆ అధికారి ఎందుకు తెలుసుకోవడం లేదు. సెక్రటరీలు పూర్తిస్థాయిలో జమ చేసి ఉంటే విమర్శలు ఎందుకు వినిపిస్తాయి, కొంతమంది ప్రజాప్రతినిధులు పలువురు సెక్రటరీ జనరల్ ఫండ్ పంచాయతీ అకౌంట్‌లో జమ చేయడంలో విఫలమయ్యారని ఆరోపిస్తున్యానరు. కొంతమంది సెక్రటరీలు గుమ్మస్తాలు కూడా చేతివాటం ప్రదర్శించారనే వాదనలు సైతం వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల నకిలీ బిల్లులు ఏర్పాటు చేశారని విషయం కూడా జోరుగా చర్చ జరుగుతూ ఉంది. దీనికి గతంలో గొల్లపూడి సర్పంచ్ సెక్రటరీ సస్పెండ్ కూడా బలాన్ని చేకూరుస్తుంది. జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీలో జనరల్ ఫండ్ పనులు ఎంత జమ, ఎంత వాటి మధ్య వ్యత్యాసం ఏమిటి అనే దానిపై ఒక్కసారి పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి. ఫండ్ మిస్సింగ్ అయిందా, మిస్సింగ్ కాలేదా అనే దానిపై కూడా ప్రజలకు ఒక స్పష్టత తెలుస్తుంది. ఇప్పటికే పలువురు సెక్రటరీలు చేతివాటం ప్రదర్శించారనే వాదన వినిపిస్తుంది. కొంతమంది సెక్రటరీ ఇటీవల కాలంలో నెలకి ఎంతో కొంత పంచాయతీ అకౌంట్‌లో జమ చేసినట్టు చూపిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. వాస్తవానికి పంచాయతీల్లో జనరల్ ఫండ్ విషయంలో తప్పుదారి పట్టి ఉంటే దానికి బాధ్యత ఎవరు వహించాలి.

# విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

**-మేడా శంకరయ్య-సుశీలమ్మ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం**
**-విప్పలమడక అభివృద్ధికి తోడ్పాటునందిస్తా**
**-వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్**



ప్రజాపక్షం/వైరా: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యవుతుందని వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ అన్నారు. వైరా మంలంలోని విప్పలమడక గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మేడా శంకరయ్య-సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సుమారు రూ.15వేలు విలువ చేసే షూలు, సాక్సులు, బెల్టులు, టైలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు వాటిని అందజేశారు. అనంతరం కట్ల సంతోస్ మాట్లాడుతూ విప్పలమడక గ్రామానికి తమ కుటుంబానికి 30ఏళ్లుగా అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. తమ వ్యాపార కార్యకలాపాలకు విప్పలమడక గ్రామం కీలకంగా ఉండేదని పేర్కొన్నారు. మేడా శంకరయ్య-సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలో ప్రశంసనీయమని కొనియాడారు. విప్పలమడక గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో మంచి పాలకవర్గాన్ని ఎన్నుకోవడంతోనే విప్పలమడక గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు నెలల కాలంలో మేడా శంకరయ్య-సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ విప్పలమడక గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సామాజిక సంస్థలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భువనేశ్వరరావు మాట్లాడుతూ మేడా ధశంకరయ్య-సుశబులమ్మ చారిటబుల్ ట్రస్ట్ స్ఫూర్తితో తన తల్లి పేరుతో పోతినేని సరోజిని చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ నూతన ట్రస్ట్ ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బూర్గు లూర్దమ్మ, మాజీ ఎంపిటిసి ఆకుల ప్రసాద్, గ్రామ కార్యదర్శి కాంపల్లి ధనమ్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దొంతెబోయిన సత్యనారాయణ, వార్డు సభ్యులు, ముత్తమాల నాగజ్యోతి, పారుపల్లి నిఖిత, గరిడేపల్లి శ్రీనివాసరావు, కాశిమాల సామేలు, బూర్గు నందిని తదితరులు పాల్గొన్నారు.

# జుజ్జలరావుపేటలో అనుమతి లేని ఇటుక బట్టీలు..!

**-ల్యాండ్ కన్వర్షన్ లేకుండా బట్టీల నిర్వహణ**
**-లక్షల్లో ఇటుకల వ్యాపారం.. జిపికి ఆదాయం శూన్యం**
**-పట్టించుకోని రెవెన్యూ అధికారులు**



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని జుజ్జలరావుపేట గ్రామ పంచాయితీ పరిధిలో దశాబ్ద కాలంగా నిర్వహించబడుతున్న మట్టి ఇటుకల బట్టి మూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమ వ్యాపారం వృద్ధి చెందుతూ ధనార్జనే ధ్యేయంగా నిర్వహిస్తున్నారు. ఆంధ్ర నుండి వచ్చిన ఇటుక వ్యాపారులు వారు నిర్వహిస్తున్న ఇటుక బట్టీలకు గత దశాబ్ద కాలము నుండి ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహించడం గమనార్హం.

**ల్యాండ్ కన్వర్షన్ లేకుండా బట్టిల నిర్వహణ....**

మండలంలోని జుజ్జలరావుపేట రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ భూముల్లో నిర్వహించబడుతున్న ఈ ఇటుకల బట్టిలు ప్రభుత్వ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఇంకా ల్యాండ్ కన్వెన్షన్ చేయకుండా వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూమిగా మార్చటం దశాబ్దాల తరబడి అక్రమ వ్యాపారానికి పాల్పడటం వారికి అందవేసిన చేయిగా మారింది. కొందరు అక్రమార్కులు అండదండలతో ఈ వ్యాపారాన్ని నిర్వహించుకుంటూ వ్యవసాయ రంగానికి ఉపయోగించే పంట భూములను వారు బొగ్గు భూములుగా మారుస్తూ పర్యావరణానికి అటంకం కలిగిస్తున్న పరిస్థితి నెలకొన్నది. ఇటుక బట్టిల నిర్వహణతో పరిసర ప్రాంతాల్లోని చింత చెట్లు పూర్తిగా నాశనమైన పరిస్థితి నెలకొన్నది. మరీ కొంత కాలం ఇలానే ఉంటే భవిష్యత్తులో చింత చెట్లను బొమ్మలలోను పార్కులలోనే ప్రత్యేక ప్రదేశాలలోనూ నర్సరీలోనూ మాత్రమే చూడవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు.

**లక్షల్లో ఇటుకల వ్యాపారం....జిపి ఆదాయం శూన్యం....**

జుజ్జలరావుపేటలో నిర్వహించబడుతున్న ఇటుక బట్టీల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ ప్రాంతంలో ఇటుక బట్టిలు నిర్వహిస్తూ కోట్లాది రూపాయల్లో ఆదాయం ఒక్కొక్క నెలల్లో లక్షల రూపాయల్లో మిగులుబాటుతో నిర్వహించబడుతున్న ఈ అక్రమ వ్యాపారం గ్రామ పంచాయితీ నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రెవెన్యూ అధికారుల నుండి వ్యవసాయ భూములు ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే గ్రామ పంచాయితీలో ఎటువంటి అనుమతులు పొందకుండా ఈ అక్రమ వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయితీ ఒక్కొక సంవత్సరం లక్షలలో ఆదాయాన్ని కోల్పోవడం గమనర్హంగా ఉన్నది. ఇంకా వీరు నిర్వహించే ఇటుకల వ్యాపారం స్థానికతను మరిచి సమీప గ్రామాల్లో ప్రజలకు ధరలు అందుబాటులో లేకుండా వారి ఇష్టమైన రీతిలో డిమాండ్‌గా వారు చెప్పిందే వేదంగా సామాన్యుడు కొనలేని అంతా రేట్లు పెంచుతూ ఇటుకల వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నిర్వహిస్తున్నారు.

**అదుపు చేయని రెవెన్యూ అధికారులు....**

వ్యవసాయ భూములను ఎటువంటి ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా యదేచ్ఛగా ఇటుక బట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న అక్రమార్కుల వైపు తిరిగి చూడకుండా కూసుమంచి రెవెన్యూ అధికారులు మిన్నకుండా ఉండటంలో అర్థం ఏమిటని జనం చర్చించుకుంటున్నారు. ఈ మౌనంలో అర్థాన్ని కూడా ప్రజలు కొంత అర్థం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి జుజ్జలరావుపేటలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలకు అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయాన్ని తెలపాలని ప్రజలు కోరుతున్నారు.

**తహసీల్దార్ రవి కుమార్ వివరణ....**

ఈ సందర్భంగా బట్టిల నిర్వహణ అనుమతుల విషయంపై తహసీల్దార్ రవి కుమార్‌ను ప్రజాపక్షం వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ జుజ్జలరావుపేట గ్రామంలో నిర్వహించబడుతున్న ఇటుక బట్టీలకు నాకు తెలిసినంతవరకు నేను వచ్చినప్పటి నుండి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, లేని వారికి నోటీసులు కూడా అందిస్తామని తెలిపారు.

# కారేపల్లిలో దొంగనోట్ల కలకలం..!

**-చిట్టీ వ్యాపారుల దందాపై కన్నేసిన పోలీసులు**
**-కారేపల్లి మండలంలో**
**నెలసరి రూ 50కోట్లకు పైబడే అక్రమ వ్యాపారం**
**-అనుమతులు లేకుండా అడ్డగోలుగా చిట్టీలు, గిరి గిరి, ఫైనాన్స్**

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లిలో దొంగ నోట్ల చలామణి వ్యవహారం వ్యాపార వర్గాల్లో కలకలం సృష్టిస్తుంది. మూడు రోజుల క్రితం బ్యాంక్ అధికారులు గుర్తించిన దొంగ నోటు వ్యవహారం బయటికి రావడం అది కూడా ఓ ప్రైవేట్ చిట్టీ వ్యాపారి వద్ద నుండి చలామణి అయిందనే ఆరోపణపై విస్తృతంగా చర్చ జరగడంతో ఇంటిలిజెన్సీతో పాటు కారేపల్లి పోలీసులు కూడా వివరాలు తెలుసుకునే పనులు చేపట్టారు. కారేపల్లి బీసీ కాలనీకి చెందిన ఓ చిట్టి వ్యాపారిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు కూడా సమాచారం. కారేపల్లి కేంద్రంగా మండల వ్యాప్తంగా అనుమతులు లేకుండా చిట్టీలు, గిరి గిరి, ఫైనాన్స్, గ్రూప్ లోన్ల పేరుతో నెలసరి 50కోట్ల రూపాయలకు పైబడి అక్రమ దందా నడుస్తోంది. ఈ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిలో కొందరు దొంగ నోట్ల చలామణి కూడా సులువుగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా బ్యాంక్ అధికారులే గుర్తించిన ఫేక్ నోట్ చిట్టీలు నడిపే వ్యక్తి నుంచే రావడంతో కారేపల్లిలో నడుస్తున్న అక్రమ దందాపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. భారీ స్థాయిలో అక్రమ దందా నడుస్తున్నప్పటికీ నిఘా వర్గాలు వీటిపై దృష్టి సారించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. అనుమతులు లేని అక్రమ వ్యాపారాలు బహిరంగంగానే జరుగుతున్నా నియంత్రించాల్సిన యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషించడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దొంగ నోట్ల కలకలంతో వ్యాపార వర్గాలు కూడా ఆందోళన చెందుతున్నాయి. దుకాణాలకు వచ్చిన ప్రతి నోటును క్షుణ్ణంగా పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టుబడ్డ నోటు కూడా బయట గుర్తించలేని విధంగా ఉండటంతో వ్యాపార వర్గాల ఆందోళన చెందుతున్నాయి.

**నిఘా నిద్రపోతుంటే..దగా దండుకుంటుంది..**

అక్రమ వ్యవహారాలను నియంత్రించాల్సిన నిఘా విభాగాలు నియంత్రించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అక్రమ వ్యాపారాలకు తెరలేపిన దగా కోరులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

**ఆంధ్ర ముఠాల ఫైనాన్స్ ఆగడాలు...**

మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పేద మధ్య తరగతి గిరిజనుల అవసరాలను ఆసరాగా తీసుకొని ఆంధ్ర నుండి వచ్చిన ఫైనాన్స్ ముఠాల అక్రమవ్యాపారం అడ్డు అదుపు లేకుండా సాగుతుంది. వారాల వసూళ్లతో అధిక వడ్డీలు వసూలు చేస్తూ గ్రామాల్లో ఫైనాన్సు చేస్తున్నారు.

**అక్రమ దందాపై పోలీసులు దృష్టి సారించాలి....**

కారేపల్లి మండలంలో అక్రమంగా నడుస్తున్న దందాలపై పోలీస్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల కొత్తగా వచ్చిన డైనమిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎన్నో క్లిష్టమైన కేసులను చేధించి పోలీస్ శాఖలో మంచి పేరు కూడా సాధించారు. అదే స్ఫూర్తితో ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ దందాపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తే అనేక అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు కోరుతున్నారు.

## ప్రహరీ గోడ కోసం విద్యార్థుల వినతి



ప్రజాపక్షం/ములకలపల్లి: గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడను మంజూరు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన అబ్దుల్ కలాం బాలసభ సభ్యులు బుధవారం ములకలపల్లి సర్పంచ్ కొర్సా చంద్రలేఖకు ములకలపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో ఇటీవల నిర్మించిన మరుగుదొడ్లు వినియోగించే విధంగా లేవని, ప్రహరీ గోడ లేని కారణంగా పశువులు మేతకు వెళ్లే సమయంలో వచ్చే సమయంలో పాఠశాల ఆవరణను అపరిశుభ్రం చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ చంద్రలేఖ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, వార్డు సభ్యులు వీరు నాయక్, ముదిగొండ శ్రీను, పంచాయితీ కార్యదర్శి రవి, గుడ్ షెప్పర్డ్ సంస్థ సిస్టర్స్ ఉదయ, సిబ్బంది సుజాత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## షాదిఖానా, మస్జిదద్‌ల సందర్శన



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండల కేంద్రంలో గల షాదిఖానా, మస్జిద్‌లను, ఈద్గాలను, ఖబరస్తాన్‌లను డిస్ట్రిక్ట్ వెల్ఫర్ ఆఫీసర్ ఎండి ముజాహిద్ సందర్శించారు. ఈసందర్భంగా వాటికి కావలసిన వసతులు, బ్లీచింగ్ పౌడర్, లైటింగ్, పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి చెట్లను తొలగించే విషయంలో ఎంపీడీవోకి చరవాణిలో సమాచారం అందించారు. ఎంపీడీవో సానుకూలంగా స్పందించి, మండలంలోని మస్జిద్‌లు, ఖబరస్తాన్‌లు, ఈద్గాలు ఉన్న గ్రామ పంచాయితీ సర్పంచులకు, కార్యదర్శుల ద్వారా ఈ సమస్యలను పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ పాషా(షేరు), మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ హనీఫ్, మాజీ షాదిఖానా ఛైర్మన్ షేక్ షఫీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, సింగరేణి పంచాయితీ 5వ వార్డు సభ్యులు ఎండీ యాకుబ్ అలీ, రేషన్ డీలర్ షేక్ అబ్దుల్ మతీన్, షేక్ మీరా(టెంట్ హౌస్) పాల్గొన్నారు.

## పిఆర్‌టియూ జిల్లా కార్యదర్శిగా ఈర్ల కృష్ణ



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ కూసుమంచి పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(మాథ్స్)గా విధులు నిర్వహిస్తున్న ఈర్ల కృష్ణను పిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు కట్టా శేఖరావు పిఆర్‌టియూ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పిఆర్‌టియూ ఎజెండా అని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని, పిఆర్‌సిను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఈర్ల కృష్ణను అభినందిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఈర్ల కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతం, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం నిబద్ధతతో పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పిఆర్‌టియూ కూసుమంచి మండల అధ్యక్షులు శీలం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం సతీష్, రాష్ట్ర బాధ్యులు సాదే వెంకన్న, సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్, శోభన్ బాబు, సర్వర్మియా, ఉపాధ్యాయులు నరేష్, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జక్కేపల్లి రాష్ట్రంలోనే ఉత్తమమైన పోస్ట్ ఆఫీస్



ప్రజాపక్షం/కూసుమంచి: బ్యాకింగ్ సేవలు, ఇన్సూరెన్స్ సేవలు, సుకన్య సమృద్ధి, ఇంకా 50 రకాల సేవలు పోస్ట్ ఆఫీస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ అత్యధిక జనాభా పొదుపు చేయడం జన జీవనంలో భాగంగా పొదుపు అలవాట్లు ఉండటం కలిసి వచ్చే అంశమని జిల్లా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. విష్ణువర్ధన్ రాజు పోస్ట్ ఆఫీస్ నందు 550 ప్రమాద భీమా పాలసీ చేయడం జరిగింది. ప్రమాదశాత్తూ మరణించడం జరిగింది. కాగా బుధవారం నామిని అయిన రమాదేవికి రూ 10లక్షల చెక్కును జిల్లా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి, ఐపిబి మేనేజర్ రాజేష్, పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఉమ్మడి జక్కేపల్లి సర్పంచుల చేతుల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో మెయిన్ ఓవర్సిల్ పెరుగు నాగేశ్వరరావు, లక్ష్మణ్, పోస్ట్ మాస్టర్ సోమేశ్ కుమార్, సర్పంచులు జక్కేపల్లి నలబోలు చంద్రారెడ్డి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ లక్ష్మయ్య, ఉపసర్పంచులు కోటయ్య, నాగరాణి, మాజీ పోస్ట్ మాస్టర్ రామిని, కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు, మండల పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపవాస ప్రార్ధనలు ప్రారంభం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ప్రపంచ వ్యాప్తంగా ఆర్సియం క్యాథలిక్ క్రైస్తవులకు తపస్సు కాలం, శ్రమల భస్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని ఉమ్మడి మండలాల ఆర్సియం పునీత పేతురు దేవాలయ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్లు సిద్దెల జేసు ప్రసాద్, గబ్బెట అరుణ్, సిఎస్ఐ రెవరెండ్ పాస్టర్లు గుజ్జర్లపూడి ఏసుపాదం, లింగాల శామ్యూల్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి క్రైస్తవుడు వ్యక్తి శరీర ఆకలితో త్యాగం చేయడం కన్నా, పరివర్తన హృదయాలతో మనసుతో త్యాగం చేయాలన్నారు. 40 రోజుల పాటు ఉపవాస ప్రార్ధనలకు ప్రతి క్రైస్తవుడు, ఇహలోక వ్యవసనాలకు, వ్యామోహాలను, అమితమైన ఆహార పదార్థాలను త్యజించి, దేవుడికి దగ్గరగా ఉండి ఆధ్మాత్మికంగా సత్ప్రవర్తన కలిగి నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమిస్తూనే, నీతోటి వారికి సహకరిస్తూ, పేదలను, అనాధలను, ఖైదీల్లోని వ్యక్తుల కోసం ప్రార్ధిస్తూ, దిక్కులేని వారికి ఆశ్రయమిస్తూ, దానధర్మాలను పుణ్యకార్యాలు చేయడమే అసలైన ఉపవాస దీక్షలని పేర్కొన్నారు. దేవుడు ప్రసాదించిన క్షమాగుణాన్ని కవచంగా ప్రతి క్రైస్తవులు పరిరక్షించుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**-భూ సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నేషనల్ హైవే ప్రాజెక్టుల పూర్తికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నేషనల్ హైవే ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధంసలాపురం ఎంట్రీ, ఎగ్జిట్ భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. 1.38 ఎకరాల భూ సేకరణకు ప్రక్రియ పూర్తి చేసి భూమి అప్పగించాలన్నారు. అదనపు భూ సేకరణకు సంబంధించి ప్రిలిమినరి నోఫికేషన్ పబ్లిష్ చేసినట్లు, పిడి ప్రక్రియ ప్రాసెస్‌లో ఉన్నట్లు తెలిపారు. మార్చి 15 నాటికి పనులు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. నాగపూర్ అమరావతి నేషనల్ హైవే ఖమ్మం విజయవాడ ప్యాకేజీ 1కు సంబంధించి కొణిజర్ల మండలం గోపతి, బోనకల్ మండలం చిన్నబీరవల్లి గ్రామాల్లో భూమి స్వాధీనానికి చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం విజయవాడ ప్యాకేజీ 2కు సంబంధించి మధిర, ఎర్రుపాలెంలో మిషన్ భగీరథ అటవీ శాఖలతో స్ట్రక్చర్ల వాల్యువేషన్ పూర్తి చేసినట్లు ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలన్నారు. ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం గ్రామం, మధిర మండలం నిదానపురం గ్రామాల్లో భూ స్వాధీనానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేబుల్ బ్రిడ్జి భూ సేకరణకు సంబంధించి అవార్డు మొత్తాన్ని డిపాజిట్ చేయాలని తెలిపారు. వీధి వ్యాపారులకు వెండర్ జోన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రత క్రింద గుర్తించిన 17 జంక్షన్లలో చేపట్టిన భద్రత చర్యలు నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, నేషనల్ హైవే పిడి దివ్య, తహసీల్దార్లు సైదులు, రమాదేవి, అరుణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

**-రుణాల రికవరిపై అధికారులు శ్రద్ధవహించాలి**
**-ఉపాధి పనులు సకాలంలో పూర్తి చేయాలి**
**-అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, ఈజిఎస్ సెర్ప్, గ్రామ పంచాయతీ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల గ్రామంలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా అనుసరిస్తున్న విధానాలపై సమావేశాలు నిర్వహిస్తూ మినిట్స్ కాపీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిబ్రవరి 20 వరకు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో గుర్తించిన అంశాలను నాలుగు వారాల్లో పరిష్కరించి వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రఘునాథపాలెం మండలం, తిరుమలాయపాలెం మండలంలో తక్కువగా ఉపాధి పనులు జరిగాయని ఉపాధి హామీ పనుల క్రింద మంజూరు చేసిన అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో పూర్తి చేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలన్నారు. చేసిన పనుల వివరాలను రికార్డులలో నమోదు చేసి సకాలంలో చెల్లింపులు జురిగేలా చూడాలన్నారు. మండలంలో ఉపాధి హామీ క్రింద క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభం కానీ పనులను క్లోజ్ చేయాలన్నారు. సోషల్ ఆడిట్‌కు సమాంతరంగా ఉపాధి హామీ పనులు కూడా జరిగేలా చూడాలన్నారు. మహిళలను స్వశక్తి మహిళా సంఘాల్లో భాగస్వామ్యం చేసేందుకు నూతన ఎస్‌హెచ్‌జిలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామసమాఖ్య, మండల సమాఖ్యలకు సొంత భవనాల నిర్మాణాలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లపై దృష్టిసారించి నిర్దేశిత లక్ష్యం ప్రకారం వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. పంచాయతీలకు వచ్చే గ్రాంట్ నిధులను పకడ్బందీగా ఖర్చు చేయాలని ఎక్కడ ఎటువంటి అవకతవకలు జరగడానికి వీలు లేదన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో కె. శ్రీరామ్, డిపివో రాంబాబు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, డిఎల్‌పివో విజయలక్ష్మి, ఎంపిడివోలు, ఎంపివోలు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫోసిస్ శిక్షణా తరగతులు ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిటి అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్తంగా 15 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సిఎస్ఆర్) ద్వారా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. పైథాన్ వెబ్ డెవలప్‌మెంట్ పై ఈ శిక్షణ అందిస్తున్నారని ఆయన తెలిపారు. శాస్త్రీయ రంగంలో పైథాన్‌కు ఉన్న ఆదరణ దృష్ట్యా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఐసిటి అకాడమీతో అవగాహన ఒప్పందం ద్వారా ఈ శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. శిక్షణలో భాగంగా మొదటి మూడు రోజులు సాఫ్ట్ స్కిల్స్‌పై, మిగిలిన 12 రోజులు పైథాన్ వెబ్ డెవలప్‌మెంట్ పై శిక్షణ అందిస్తారని ఆమె తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటి పేరుతో నిర్వహించే ఈ శిక్షణా తరగతులు 100 గంటలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 20 గంటలు సాఫ్ట్‌స్కిల్స్, 80 గంటలు పైథాన్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి ఆధునీక టెక్నాలజీలలో సైతం పైథాన్‌ను ఉపయోగిస్తారని వెబ్ డెవలప్‌మెంట్‌తో ఉద్యోగ అవకాశాలు అందుకోవచ్చునని సూచించారు. ఎంపిక చేయబడిన 65 మంది విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు ఇట్టి అవకాశాన్ని ఇచ్చిన ఐసిటి అకాడమీ రిలేషన్‌షిప్ మేనేజర్ గౌస్‌పాషాను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గాదెకు నివాళులర్పించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు గాదె సత్యనారాయణ మొదటి వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో ఉన్న వారి నివాసంలో స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్ హాజరయ్యారు. అతిథులు గాదె సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహనా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు దోమ ఆనంద్, భాగం నీరజ, సీనియర్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, కొత్తూరు ప్రభాకర్ రావు తదితరులున్నారు.

## జెఈఈ మెయిన్స్‌లో భరత్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో మధిర భరత్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారు. బి. అనిల్‌కుమార్‌రెడ్డి 98.27 పర్సంటైల్, ఎం. శ్రీఉజ్వల్ 90.07 పర్సంటైల్ తో మధిర ప్రాంతంలో ఉత్తమ ప్రతిభను కనబర్చారు. వీరిని భరత్ విద్యా సంస్థల కరస్పాండెంట్ విద్యాలత వెంకటరెడ్డి, సిబ్బంది జింకల కోటేశ్వరరావు, కె. రవీంద్రరెడ్డి, ఉమా, బి. స్రవంతి, పలువురు అభినందించారు.

## కార్మికులకు వస్త్రాల అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6,25,26 డివిజన్లలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు ముణి, బాణి జ్ఞాపకార్థంగా కుమారుడు మూడ్ వెంకటేశ్వర్లు రూ.26వేల విలువగల వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ పిల్లి శ్రీనివాస్, దామళ్ల కిరణ్, జవాన్ బానోత్ హుస్సేన్, కుటుంబ సభ్యులు ధర్మబాయి, చందులాల్ కుమారులు పాల్గొన్నారు.

## తీర్థాల హుండీ లెక్కింపు

**- రూ.4,27వేల3392 ఆదాయం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాలలో ఐదురోజులపాటు ఘనంగా నిర్వహించిన జాతర ముగిసింది. ఈ సందర్భంగా ఆలయానికి హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని పోలీసుల ఆధ్వర్యంలో ఎండోమెంట్ అధికారులు బుధవారం లెక్కించారు. ఈ మేరకు రూ.4,27,3,392 ఆదాయం వచ్చినట్టుగా కార్యనిర్వాహణాధికారి చార్యులు పేర్కొన్నారు. కాగా గత సంవత్సరం కంటే 2లక్షల76వేళ194రూపాయల ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా ఇన్స్పెక్టర్ సమత, జూనియర్ అసిస్టెంట్ రాజేందర్, ధర్మకర్తల మండలి చైర్మన్ రామోజీ, డైరెక్టర్ సేవ్య, మాజీ సర్పంచ్ బోడ వెంకన్న, బిఆర్ఎస్ నాయకుడు బానోత్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటక ప్రదర్శనలో అలరించిన చిన్నారి



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర పట్టణంలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం రాత్రి శివాలయ ప్రాంగణంలో శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నాటక ప్రదర్శనలో మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు మనవడు ఎస్.కార్తీక్‌నాయన్(ఎస్ఎఫ్ఎస్ 6వ తరగతి) దుర్యోధనుడు పాత్రలో వీక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్‌నాయన్‌ను ప్రముఖులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, కళాపరిషత్ అధ్యక్షులు గడ్డం సుబ్బారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు, శ్రీ సీతారామాంజనేయ కళాజాత బృందం పాల్గొన్నారు.

## పిఎసిఎస్ అవకతవకలపై మంత్రి తుమ్మలకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఎసిఎస్)లో రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడ్డారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేత కాపా సుధాకర్ మంత్రిని కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి విచారణ జరిపి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



**ప్రజాపక్షం/వైరా:** స్నానాల లక్ష్మీపురం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్యిర జాతరకు హుండీ ఆదాయం భక్తుల కానుకల ద్వారా రూ.362950లు, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.49200లు, శీఘ్ర దర్శనం రూ.131196లు, ప్రత్యేక దర్శనం రూ.84900లు, దర్శనం రూ.45850లు, జాతర షాపుల ఆదాయం రూ.150500లు, కొబ్బరి చిప్పల వేలం పాట రూ.43వేలు, లడ్డు ప్రసాదం రూ.140000లు, మొత్తం రూ.1007596లు. గత సంవత్సరం కంటే రూ.64032లు పెరిగింది. గత సంవత్సరం మొత్తం ఆదాయం రూ.943564లు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దొడ్డా ఉషారాణి, సభ్యులు మల్లు శేషమ్మ, సుల్తాన్ పద్మ, తలారి నర్సింహారావు, మొగునూరి సత్యనారాయణ, సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు, ఈవో హరిచంద్ర శేఖర్, పంచాయతీ కార్యదర్శి ఆర్.భారతి, వైరా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, ఉప సర్పంచ్ అమ్మిక వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, దేవాలయ పూజారి కంచెల చంద్రశేఖర్ శర్మ, సుల్తాన్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# పది విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలి



**- అందరినీ సమీప ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అనుసంధానం చేయాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్**

ప్రజాపక్షం/కొత్తగూడెం : పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలని, అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పది ఉత్తీర్ణత, ప్ర జూ. కాలేజీల్లో ప్రవేశాలు, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం మెరుగు తదితర అంశాలపై బుధవారం ఐడిఓసిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సిఇఒ నాగలక్ష్మి తో కలిసి ఎంఇఓ, ఎంపిఓలు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సం. గత అదాదిగి భిన్నంగా ఫలితాలు ఉండాలన్నారు. ఈ సారిబాలికలతో పాటు బాలురు కూడా ఉత్తీర్ణతా శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పదోతరగతి విద్యార్థిని సమీప ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అనుసంధానం చేయాలని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల కంటే ముందే తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు.

# కేజీబీవీ ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**-టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు**



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: కేజీబీవీలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలో గల కేజీబీవీలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు 2024 అక్టోబర్ నుండి 2025 జనవరి వరకు(నాలుగు నెలల)బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తున్న కేజీబీవీ పాఠశాలలో రాష్ట్ర విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి పాఠశాలల్లో నిబద్ధతతో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రావలసిన నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించకపోవడం అన్యాయం మాత్రమే కాకుండా వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాల కారణంగా ఉపాధ్యాయులు కుటుంబ పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పులు చేయవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేసి, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో భాగ్యశ్రీ, సుధ, అనిత, సరోజిని, సంధ్యారాణి, స్వర్ణ, రమాదేవి, నస్రీన్, పద్మజ, కవిత, నాగలక్ష్మి, శైలజ, సైదమ్మ, రజిని, భూలక్ష్మి, సంధ్య, ఉమ, మమత, సరిత, శ్రీలక్ష్మి, కమల, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల సాధన కోసం మరో అడుగు



**- జిఎం షాలేమ్ రాజ్‌తో రాజ్ కుమార్ భేటి**
**- కార్మిక సమస్యలు పరిష్కరించాలంటూ వినతి**

ప్రజాపక్షం/కొత్తగూడెం : కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటియూసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మరో అడుగు వేసింది. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్‌తో కలిసి సింగరేణి జిఎం షాలేమ్ రాజ్‌తో ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికేఓసి ఉపరితల గనిలో ఉత్పత్తిని ప్రారంభించి స్థానిక కార్మికులతో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఏరియా వర్క్‌షాపులో క్లర్కుల కొరత కారణంగా కార్మికులకు చెందాల్సిన ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, పరిపాలన పరమైన జాప్యం జరుగుతోందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక వాడ గౌతమ్ పూర్‌లోని స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించడంతో పాటు స్విమ్మింగ్ కోచ్‌ను నియమించాలన్నారు. కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు జిఎంను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిఎం షాలేమ్ రాజు వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు నాయకులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 18వ డివిజన్ నుండి కార్పోరేటర్‌గా ఎన్నికైన కంచర్ల హిమ శ్రీని జిఎంకు పరిచయం చేయగా, హార్థిక శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, వైస్ ప్రెసిడెంట్ కత్తర రాములు, బ్రాంచ్ ఆఫీస్ బేరర్ సందెబోయిన శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మధుకృష్ణ, సౌజన్య, సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, సిపిఐ నాయకులు పాటి మోహన్, మండల రాజు, కోటి, శివ, సుదర్శన్, మన్నెంపల్లి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు అంకుష్ మృతి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం స్వాతంత్ర సమరయోధుడు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్. అంకుష్(83) మంగళవారం మృతి చెందారు. మృతునికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 50 సంవత్సరాలుగా టైలర్ వృతిలో వారి విద్యను పది మందికి నేర్పించి మంచి పేరు తెచ్చుకున్నా రు. వారి మృతికి సంతాపకంగా స్థానిక సర్పంచ్ సంద్రు అశ్విని, ఉపసర్పంచ్ షేక్. శబాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఆత్మ కమిటీ చైర్మన్ కంచర్ల వెంకటనర్సయ్య, ఎర్రుపాలెం మాజీ సర్పంచ్ జమలాపురం చిన్నకిషన్‌రావు తదితరులు సంతాపం తెలిపారు.

# సిపిఐ సీనియర్ నాయకులు పులి కృష్ణ మృతి

**సందర్శించి సంతాపం తెలిపిన సిపిఐ జిల్లా, మండల నాయకులు**



ప్రజాపక్షం/మణుగూరు: సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సింగరేణి ఉద్యోగి, మణుగూరు మండల కౌన్సిల్ సభ్యులు, శివలింగాపురం గ్రామస్తులు పులి కృష్ణ (70) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మీ నారాయణ, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల బిక్షం తదితరులు హాజరై ఎర్రజెండా కప్పి పూలమాలవేసి పులి కృష్ణ జోహార్లు పులి కృష్ణ అమర్హై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సంఘం నాయకుడిగా కూడా పనిచేశారన్నారు. పాతతరం కమ్యూనిస్టు నాయకుడని, అనేక పోరాటాలలో పాల్గొన్నారని, పి కె 1 ఇంక్లైన్ లో పనిచేశారని, యూనియన్ లో కూడా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వాడిని, జంగేటి మల్లయ్య,చిత్తలూరి వెంకటేశ్వర్లు అప్పటి మండల కార్యదర్శి దాట్ల చిరంజీవి బాబు నాయకత్వంలో ఆనాడు, పాత తరం వారితో ఉండేవారని, పార్టీ సిద్ధాంతాల కట్టుబడి పని చేశారని, వారు మరణించడం దురదృష్టకరమని వారు అన్నారు.వారువున్నవారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# రాష్ట్రస్థాయి సిఎం కప్‌కు బిసి బాలుర హాస్టల్ విద్యార్థులు



ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సిఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జి. రాము, జి.లక్ష్మణ్ అనే ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి సిఎం కప్ హాండ్ బాల్ క్రీడల్లో ఈనెల 19 నుండి హైదరాబాద్ లో జరిగే పోటీలకు వెళ్లనున్నారు. విద్యార్థులను బిసి వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి, డివిజనల్ ఆఫీసర్ అపర్ణ, వార్డెన్ అరుణ అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పేరుతేవాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



ప్రజాపక్షం/పాల్వంచ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందని, కావునా విద్యార్థులు కష్టపడుతూ, ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని దంతెలబోర సర్పంచ్ కొండ్రు ప్రసాద్ అన్నారు. మండల పరిధి దంతెలబోర ప్రాథమిక పాఠశాలలో చదువుకునే ఎర్రబోరు, సీతారాంపురంకు చెందిన 40 మంది నిరుపేద విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు, పెన్నులు,పెన్సిల్స్, తెలుగు, ఇంగ్లీష్ కాపిరైటింగ్ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లెంపాటి వెంకటేశ్వర్లు సూచనతో సర్పంచ్ అందజేశారు. అనంతరం సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి కావాలంటే పాఠశాలలు, వైద్యశాలలు బాగుండాలన్నారు. పాఠశాల ద్వారా కొనుగోలు చేసిన రీచార్జింగ్ ఆడియో సిస్టంను ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎంకు ప్రత్యేక దన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, రామేశ్వరి, ఈరు, భీము, మంగీలాల్, గ్రామ పెద్దలు నాగిరెడ్డి, సత్యనారాయణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహంలో హెల్త్ క్యాంప్



ప్రజాపక్షం/మణుగూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో అంబేద్కర్ సెంటర్ నందు ఎంజేపిటిబిసిగర్ల్స్ హాస్టల్ లో హెల్త్ క్యాంప్ నిర్వహించి వారి రుగ్మతల సంబంధించి ఎక్కువగా టాన్సిల్, జలుబు, దగ్గు వాటికి సంబంధించిన మందులు ఇవ్వడం జరిగింది. పిల్లలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, తడి లో దుస్తుల ధరించరాదని , పరిశుభ్రమైన శానిటరీ నాప్కిన్స్ వాడాలని, నీరు ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్ సునీల్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, కృష్ణ, జ్యోతి పాల్గొన్నారు.

# నూతన 33/11 కెవి ఉపకేంద్రం పనులు పూర్తి



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం సెక్షన్‌లో పద్మాపురం (గ్రామం)లో నిర్మించిన నూతన 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) మోహన్ రావు ఉపకేంద్రాన్ని సందర్శించి పూర్తయిన పనులను సమగ్రంగా పరిశీలించారు. ఉప కేంద్రంలో అమలు చేసిన సాంకేతిక ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలు , నిర్వహణ విధానాలను సమీక్షించిన ఆయన, భద్రతా అంశాలపై అవసరమైన సూచనలు జారీ చేశారు. సిబ్బంది అన్ని భద్రతా నియమాలను కచ్చి తంగా పాటిస్తూ ఉపకేంద్ర నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం అధికారులు పాల్గొన్నారు. నూతన ఉపకేంద్రం త్వరలోనే ప్రారంభమై పరిసర గ్రామాలకు స్థిరమైన మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించనుందని అధికారులు తెలిపారు.

# దూర ప్రాంత గిరిజన హాబిటేషన్లలో విద్యుత్ బలోపేతం




ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం సెక్షన్‌లో ఉన్న దూర ప్రాంత గిరిజన హాబిటేషన్లు తాటిగూడెం మరియు చింతలగుంపు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 25 కెవిఎ సామర్థ్యంతో కూడిన 2 సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) మోహన్ రావు పరిశీలించి విజయవంతంగా ప్రారంభించారు.ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా గతంలో ఎదురైన లో వోల్టేజ్ సమస్యలు గణనీయంగా తగ్గి, విద్యుత్ సరఫరా స్థిరత్వం మరియు నాణ్యత మెరుగుపడింది. 25 సంవత్సరాలు గా విద్యుత్ లేని చింతలగుంపు కి నేడు విద్యుత్ రావడంతో , స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోహన్ రావు స్థానిక లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆశ్రమ పాఠశాల తనిఖీ



ప్రజాపక్షం/కల్లూరు : కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినిలతో భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను తెలిపారు. పాఠశాల పరిశుభ్రత పారిశుద్ధ్యం మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చైర్మన్ హోదాలో మొదటిసారిగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటేశ్వరి లతోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పేదలను ఆదుకోవటమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు డా.మట్టా దయానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన సుమారు 85 మంది కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు రూ.97.75లక్షల చెక్కులను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అందజేశారు. వేంసూరు మండలానికి చెందిన 55 మందికి 55,06,380 విలువైన చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మరో 38 మందికి రూ.12,58,500 చెక్కులను అందజేశారు. అదే విధంగా సత్తుపల్లి పట్టణం, మండలానికి చెందిన మొత్తం 30 మందికి రూ.30,10,116 విలువైన సహాయ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ , సత్తుపల్లి, వేంసూరు తహాశీల్దార్ లు, సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్స్, సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, పట్టణ అధ్యక్షులు గాదే చెన్నకేశవరావు, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి , సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహా రావు,సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ శ్రీనివాసకాలని శ్రీనివాసగిరిపై వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలను మార్చి 14 నుండి 17 వరకు నిర్వహిస్తున్నామని 15వ, తేదీన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరుప తలపెట్టామని ఆలయ సేవ ట్రస్ట్, భక్త సమాజ మండలి సబ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుదవారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు ఫిబ్రవరి 17వ, తేదీ గురువారం రోజున ప్రచార రథం ప్రారంభం, గోడ పత్రికలు, వాయిస్ ఓవర్ ఆవిష్కరణ చేస్తున్నామని తెలిపారు. స్వామివారి సేవలో నిమగ్నమైన మహిళా భక్తులను చీర, సారెతో 27వ, తేదీన ఘనంగా సన్మానించుకొంటున్నామని చెప్పారు. అనంతరం ఆద్యాత్మిక ప్రవచకులు కోకిల మంజులచే ప్రవచన కార్యక్రమం, మార్చి 8వ, తేదీన విద్యార్థులు, యువకులు, సేవాదళ్, భక్తులచే పెద్ద ఎత్తున ఐదు కిలో మీటర్ల 5కే రన్, అనంతరం మహిళా దినోత్సవం సంధర్భంగా 5 వేయిల మంది భక్తులచే పసుపు కొట్టి తలంబ్రాలు కలిపే కార్యక్రమం, మార్చి 13న, 50 సెంటర్లలో నగర సంకీర్తన తదితర కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. మార్చి 14 నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15న, స్వామివారి కళ్యాణం, 16న, తిరు కళ్యాణం, 16న, పూర్ణాహుతి, చక్రస్నానం, 17న, పట్టణ పుర వీధులలో రథోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కావునా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. 1600 మెట్లను ఎక్కి స్వామివారిని దర్శించుకొనేందుకు మద్య వయస్సుల వారికి తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. గుట్టపైకి రహదారి సౌకర్యం కల్పించి, ఆలయ అభివృద్దికి తోడ్పాటునందించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఆలయ అభివృద్దికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు.

# నామమాత్రంగా రికవరీ

## -ముగిసిన ఉపాధి హామీ ఓపెన్ ఫోరం




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి రఘునాథపాలెం మండలంలో చేపట్టిన సామాజిక తనిఖీలో రికవరీ నామ మాత్రంగా జరిగిందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రామాల్లో 15 రోజుల పాటు 2024 25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో 739 పనులకు గాను మొత్తం రూ. 10,34,47,296 నిధులను ఖర్చు చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్‌కు సంబంధించి మండలంలోని 40 గ్రామాల పరిధిలో 383 పనులకు సంబంధించి రూ.10,31,58,519 నిధులను ఖర్చు చేశారు. వీటికి సంబంధించి తనిఖీలు నిర్వహించి గ్రామసభల్లో చర్చించారు. గ్రామాల్లో నిర్వహించిన తనిఖీలకు సంబంధించి రెండు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. గ్రామాల వారీగా తనిఖీలకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. ఈ తనిఖీల్లో రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం, కొలతలు సరిగ్గా తీసుకోకపోవడం, పనులకు సంబంధించిన బోర్డులు లేకపోవడం, నాటిన మొక్కలు సరిగ్గా లేని కారణంగా రూ.64,200 ఫైన్ విధించారు. అదేవిధంగా రికవరీకి సంబంధించి 24,600గా తేల్చారు. అయితే గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో కూలీల హాజరులో అవకతవకలు జరిగాయని పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. 10 కోట్లకు సంబంధించిన పనుల్లో రూ.24వేలు రికవరీ చూపించడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. తనిఖీలు సరిగ్గా చేయలేదని, గ్రామాల్లో చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత సరిగ్గా లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ఓపెన్ ఫోరంలో ప్రీసైడింగ్ అధికారి శ్రీదేవి, ఎంపిడివో అశోక్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, అంబుడ్స్‌మెన్ రమేష్, ఎవిఎం పవన్‌కుమార్, ఎవివో శ్రీకాంత్, పిఆర్ఏఈ చిరంజీవి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పి సురేంద్ర బాబు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఘనవిజయం

## -బీటెక్ నాల్గవ సంవత్సరం ఫైనల్ పరీక్షల్లో అగ్రస్థానం
## -అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల మరోసారి తన ప్రతిభను నిరూపించింది. జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ బుధవారం తాజాగా విడుదల చేసిన బీటెక్ నాలుగవ సంవత్సరం ఫైనల్ పరీక్షా ఫలితాల్లో కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఈ అద్భుత ఫలితాలకు కారణమయ్యాయని తెలిపారు. ప్రతి విభాగంలోనూ ఉన్నత ఎస్ జి పిఎ లు సాధించి కళాశాల ఘనతను మరింత పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి వర్చువల్‌గా పాల్గొని విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల నిబద్ధత నిజమైన విజయం సాధించాయని ప్రశంసించారు. అలాగే విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.కళాశాల కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ డా.పాముల.శేఖర్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డా.వూటుకూరి. శేషారత్నకుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.యాకూ బ్, అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు విద్యార్థినీ,విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్జీటీ పోస్టుల కన్వర్షన్‌ను ఉపసంహరించుకోవాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఉన్నత పాఠశాలలో హెచ్ ఐయం, పీఈటీ పోస్టుల భర్తీ కోసం 2325 కీలకమైన ఎస్జీటీ పోస్టులను కన్వర్షన్ చేయటానికి చేసే ప్రతిపాధనలను ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సింగారెడ్డిపాలెం పాఠశాలలో సబ్ కమిటి సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల అభివృద్ధి పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీరం చేయటం తగదని అన్నారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని ప్రమాదకరమైన ఆలోచనల ను ప్రభుత్వం విరమింపంచేయాలని హెచ్చరించారు. జీవో నెంబర్ 25 ను వెంటనే సవరించి ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులను 30 మంది ఉన్న చోట ముగ్గురు ను 30కి పైగా ఉన్న చోట ప్రతీ తరగతి ఉపాధ్యాయుడు ను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగుల హెల్త్ స్కీమ్ లను ప్రజలలో భాగస్వామ్యమైన ఉద్యోగస్తులకు నగదు రహిత కార్పోరేట్ వైద్యం ను అందించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న డీఏ లను, పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరావు, రామారావు, సబ్ కమిటి సభ్యులు కోటేశ్వరరావు, చిన్నా, రవి, గణేష్, జ్యోతి, భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్లూమింగ్ మైండ్స్‌లో ఫ్రూట్ డే




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో ఫ్రూట్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఫ్రూట్ డే వేడుకల్లో చిన్నారులు వివిధ రకాల పండ్ల వేషధారణలతో పాల్గొని అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రోజువారి ఆహారంలో పండ్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పండ్లు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందించి ఆరోగ్యాన్ని కాపాడతాయని తెలిపారు. ఫాస్ట్‌ఫుడ్‌కు బదులు సహజ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో మీట్ అండ్ గ్రీట్ విత్ డైరెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో మీట్ అండ్ గ్రీట్ విత్ డైరెక్టర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి పాల్గొన్నారు. త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులను సన్నద్ధం చేయుటకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరి తన సొంత అనుభవాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సమాజంలో మంచి లక్షణాలు ఉన్న వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు తాము అనుకున్న రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. తల్లిదండ్రులను, గురువులను ఎల్లవేళల గుర్తుంచుకోవాలని తెలిపారు. కష్టపడితేనే ఫలితం దక్కుతుందని పరీక్షలకు ఒత్తిడి లేకుండా సిద్ధం కావాలని తెలిపారు. ఐఐటి మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన పూర్వ విద్యార్థులైన వివిఎస్ లక్ష్మి , మోక్షిత సాయి, సాయి సాత్విక, వెంకటేశ్వర్లును అభినందించి సత్కరించారు. అడ్వాన్స్ పరీక్షలో కూడా మంచి ప్రతిభ కనబర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, చీకటి అప్పారావు, అర్చన ఠాకూర్, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ముస్తఫా, స్వప్న, క్యాంపస్ ఇంచార్జి చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారి ఆలయంలో పుడ్ స్టేఫ్టీ అధికారి తనిఖీలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్దిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి స్టోర్ రూములను ఖమ్మం ఫుడ్ సేఫ్టీ అధికారి లోకేష్‌కుమార్ బుధవారం సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఆలయంలోని లడ్డు తయా రు చేసే వంటశాలను , లడ్డు తయారు చేసే విధానాన్ని పరిశీలన చేశారు. అన్నదాన సత్రంలను పరిశీలించి భక్తులకు తయారు చేసిన భోజనశాలలోని వంటకాలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లోని లడ్డు తయారీకి, అన్నదానానికి ఉపయోగించే పదార్థాల నిల్వలను పరిశీలంచారు. కార్యక్రమంలో చైర్మన్ ఉప్పల విజయదేవశర్మ, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్అసిస్టెంట్ కృష్ణప్రసాద్, సిబ్బందిపాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తల్లాడ నాయకులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహ కార్యక్రమంలో తల్లాడ మండల నాయకులు పాల్గొన్నారు. తల్లాడ పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పేందుకు రాజమండ్రి రూరల్ రావులపాలెం మండలం కొత్తపేటలో పది అడుగుల కాంస్య విగ్రహం తీసుకుని వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమంలో తల్లాడ మండల నాయకులు పాల్గొన్నారు. సుమారు రూ.10లక్షల వ్యయంతో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని వారు తెలిపారు. రానున్న రోజుల్లో తల్లాడ రింగ్ కేంద్రంలో ఏర్పాటు చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఖమ్మం జిల్లా నాయకులు కేతినేని హరీష్, మండల అధ్యక్షులు సరికొండ శ్రీనివాసరాజు, కొమ్మినేని రామయ్య, ధూపాటి భద్రరాజు, రెడ్డెం వీరమోహన్ రెడ్డి, గుమ్మా హరి తదితరులు పాల్గొన్నారు.